# కష్టపడి పనిచేస్తే భవిష్యత్ మనదే..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలి
- భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- విస్తృతస్థాయి సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

దుమ్ముగూడెం, జూలై 3 : నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేస్తే భవిష్యత్ అంతా మనదేనని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, అందరికి అందుబాటులో ఉంటామని, ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా కాపాడుకుంటామన్నారు. భద్రాచలం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మండలంలోని నడికుడి మహంకాళి అమ్మవారి ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. తొలుత సభా వేదిక వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని, భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నేను ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ విప్‌గా ఉన్నప్పుడు ఈ నియోజకవర్గంలో పోడుదారులకు అండగా నిలిచానని, పోడు రైతులకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేశానని గుర్తు చేశారు. మారుమూల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించానని తెలిపారు. అనంతరం టీడీపీ నుంచి వెంకటేశ్వరరావు, పర్ణశాల మాజీ సర్పంచ్ వాగే లక్ష్మీ బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, నర్సింహమూర్తి, దొడ్డి తాతారావు, అన్నె సత్యనారాయణమూర్తి, గంపా రాజంబాబు పాల్గొన్నారు.

# తగ్గాల్సిందే..

'సిరులు కురిపించే సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం వద్దే వద్దు.. ఎంతో మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే కల్పతరువును ప్రైవేటుపరం చేయొద్దు.. ఏళ్లనాటి సంస్థను నిర్వీర్యం చేయొద్దు.. కార్మికుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మార్చే విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి.. కేంద్ర ప్రభుత్వం బ్లాకుల వేలంపై నిర్ణయం మార్చుకునేంతవరకు పోరాటం చేస్తాం..' అంటూ కార్మిక సంఘాలు నినదించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆందోళనబాట పట్టాయి. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, టేకులపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా మోదీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 12 వరకు దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

- బొగ్గు బ్లాకుల వేలం నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి..
- కొత్తగూడెం, మణుగూరులో మోదీ, ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం
- 5వ తేదీ నుంచి 12 వరకు దశలవారీ ఆందోళనలు


కొత్తగూడెం సింగరేణి : హెడ్డాఫీస్ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు

## మోదీ దిష్టిబొమ్మ దహనం

మణుగూరు టౌన్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కూనవరం రైల్వే గేట్ సమీపంలో బుధవారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ పాలనా పగ్గాలు చేపట్టిన 12 రోజుల్లోనే బొగ్గు గనుల వేలానికి శ్రీకారం చుట్టడం సరికాదన్నారు. దీనికి పరోక్షంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. 2017లో 5 కోల్ బ్లాక్‌లను, ఒడిశాలో రెండు లిగ్నైట్ గనులను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అభ్యంతరం తెలిపితే అక్కడ నామినేషన్ పద్ధతిలో కేటాయించారని గుర్తు చేశారు. నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించడం వల్ల కలిగే ఇబ్బంది ఏమిటో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి గనులను సింగరేణి సంస్థకు కేటాయించే వరకు టీబీజీకేఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, రమేశ్, బంగారి పవన్, పద్దం శ్రీనివాస్, ఇమ్రాన్, ముఖేశ్, హరిప్రసాద్, మహేశ్, మురళి, కృష్ణ సుమన్, రామకృష్ణ, వినయ్, రేవన్, రాజేశ్, రమేశ్, కోటి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

- భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్


ఇల్లెందులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు, జూలై 3 : బొగ్గు గనుల వేలం ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్, దిండిగాల రాజేందర్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఇల్లెందు ప్రాంతాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు పన్నుతున్న కుట్రలను బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. రాష్ట్రంలోని బెల్ట్ ప్రాంతాలైన ఆరు జిల్లాల్లో దశలవారీగా ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, బీఆర్ఎస్‌కు ఉద్యమాలు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ, నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, అబ్దుల్ నబి, మునిగంటి శివ, గిన్నారపు రాజేశ్, సాతాల హరికృష్ణ, డేరంగుల పోశం, ఎస్కే ఖాజా, ఆదూరి రవి, సత్యనారాయణ, చాంద్‌పాషా, లలిత్ పాసి, రవికాంత్, భూక్యా మంగయ్య, భూక్య వెంకన్న, మానియా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్మికులు

## 5 నుంచి ఆందోళనలు

టేకులపల్లి, జూలై 3 : బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆందోళనలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కోయగూడెం ఉపరితల గనిలో ఉదయం షిఫ్ట్‌లో గేట్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి, కోలిండియాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గనుల వేలానికి వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీ నుంచి 12 వరకు దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5న కలెక్టర్ కార్యాలయం ముట్టడి, 6 నుంచి 12 వ తేదీ వరకు స్థానిక జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు యూనియన్లకు అతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు కృష్ణ, ఫిట్ సహాయ కార్యదర్శి బానోత్ బాలాజీ, షేక్ సర్వర్, సామల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, అశోక్, ఇబ్రహీం, నవీన్‌కుమార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేయొద్దు

### టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

కొత్తగూడెం సింగరేణి, జూలై 3 : తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బావులన్నింటినీ సింగరేణి సంస్థకే అప్పగించాలని, కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం కేంద్ర, ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం, గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, బూర్గుల రవి, విజయ్, జీఎస్ శ్రీనివాస్, సూర్య నారాయణ, సూరజ్, జైపాల్, శివ, అరుణ్, అశోక్, వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, కౌన్సిలర్లు వేణుగోపాల్, ప్రసాద్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, కొట్టి వెంకటేశ్వర్లు, తొగరు రాజశేఖర్, సంకుబాపన అనుదీప్, అన్వర్ పాషా, ఖాజా, గౌస్, మజీద్ పాల్గొన్నారు.


హెడ్డాఫీస్ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు


మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## కేవోసీని సింగరేణికే కేటాయించాలి..


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

టేకులపల్లి, జూలై 3 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన సింగరేణి సంస్థ మనుగడ కొనసాగాలంటే కోయగూడెం పిట్ 3ని సింగరేణి సంస్థకే కేటాయించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కోయగూడెం ఉపరితల గనిలో జరిగిన పిట్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కేవోసీ బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ గురువారం సాయంత్రం 4 గంటలకు ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ అన్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, బాసు, రామకృష్ణ, అశోక్, భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జీటీల బది 'లీలలు'

- ట్రాన్స్‌ఫర్ చేసినప్పటికీ రిలీవ్ చేయడంలేదంటూ ఆరోపణలు
- రిలీవర్ల పేరుతో పాత స్థానాల్లోనే ఉంచుతున్నట్లు విమర్శలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, సంఘాల నేతలు


డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 3: జిల్లా విద్యాశాఖలోని ఎస్‌జీటీల బదిలీల్లో లీలలు చోటుచేసుకుంటున్నాయి. అనేక వినతులు, పోరాటాల తరువాత అధికారులు వారిని బదిలీ చేసినప్పటికీ వారికి రిలీవ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. తమ బదిలీల కోసం ఉపాధ్యాయులు అనేకసార్లు డిమాండ్లు చేశారు. ప్రజాప్రతినిధులకు విజ్ఞాపనలు అందించారు. కోర్టుల ద్వారా పోరాటాలు చేశారు. అవి ఫలించి అధికారులు ఎట్టకేలకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. బదిలీల ప్రక్రియను కూడా నిర్వహించారు. ఆఖరికి ఆర్డర్లు కూడా ఇచ్చారు. కానీ వాటి అమలులో కొర్రీలు పెట్టారు. దీంతో అప్పటిదాకా ఎస్‌జీటీల్లో ఉన్న ఆనందమంతా ఒక్కసారిగా ఆవిరైపోయింది. ఆదివారం బదిలీల వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. సోమవారం బదిలీల ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఆ ఉత్తర్వులతో రిలీవ్ అవుదామంటే నిబంధనలంటూ తిరకాసు పెట్టారు. ప్రధానోపాధ్యాయులు ఒకలా, ఎంఈవోలు మరోలా చెబుతున్నారు. దీంతో ఎస్‌జీటీలు గందరగోళానికి గురవుతున్నారు. బదిలీ అయినప్పటికీ రిలీవ్ చెయ్యకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**761 మందే రిలీవ్..**

జిల్లాలోని ఎస్‌జీటీలు, పండిట్‌లలో 1,161 మంది బదిలీ అయ్యారు. కాగా, వీరిలో 761 మంది ఉపాధ్యాయులను మాత్రమే పాత స్కూళ్ల నుంచి రిలీవ్ చేశారు. వీరంతా తమకు నూతనంగా కేటాయింపు జరిగిన స్కూళ్లలో రిపోర్ట్ చేసి అక్కడ చేరిపోయారు. కానీ మిగిలిన 400 మందిని మాత్రం రిలీవ్ చేయలేదు. అయితే, ఇప్పటికే బదిలీ అయిన టీచర్ల స్థానంలో తదుపరి టీచర్లు వస్తేనే రిలీవ్ చేస్తామని, లేదంటే అక్కడే విధులు నిర్వహించాలని డీఈవో, ఎంఈవోలు ఆదేశిస్తున్నారు.దీంతో ఆ 400 మంది గందరగోళానికి గురవుతున్నారు. పైగా, రిలీవ్ కోసం వీరు చేస్తున్న పైరవీలతో ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతోంది. అయితే, రిలీవ్ కాని ఉపాధ్యాయుల స్టేషన్ సీనియారిటీ పాయింట్లు నష్టపోకుండా తక్షణమే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**అత్యుత్సాహమంటూ ఆరోపణలు..**

ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా కొందరు ఎంఈవోలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రిలీవర్ అనే అంశాన్ని అడ్డం పెట్టుకొని జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని, తప్పుడు నియమాలతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇదే అంశంపై పీఆర్‌టీయూ నాయకులు బుధవారం డీఈవోకి ఫిర్యాదు చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపి తక్షణమే వారందరినీ రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభాకర్ ఆత్మహత్యపై ప్రభుత్వం స్పందించాలి

- బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలి
- దోషులను కఠినంగా శిక్షించాలి
- పలు రాజకీయపక్షాల డిమాండ్
- ఇంత జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు?
- ప్రభాకర్ తండ్రి వీరభద్రయ్య కన్నీటి పర్యంతం


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కమల్‌రాజు, కోటేశ్వరరావు


ఎస్సై నాగుల్‌మీరా కాళ్లు పట్టుకుని వేడుకుంటున్న ప్రభాకర్ పిల్లలు, కుటుంబ సభ్యులు

ఖమ్మం, జూలై 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రెండ్రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని పలు రాజకీయపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కుమారుడు మృతితో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని, రైతుకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభాకర్ తండ్రి వీరభద్రయ్య విజ్ఞప్తి చేశారు. 70ఏళ్ల వయస్సులో దివ్యాంగుడినైనా తాను కుటుంబ పోషణ కోసం ఏ పని చేయలేనని, ప్రభుత్వమే ఆదుకోవాలని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభాకర్ కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ ఉన్నంతలో కుటుంబాన్ని పోషించుకుంటూ పదిమందితో మంచి అనిపించుకుంటున్న సమయంలో తమ పొలాన్ని కొందరు కక్షపూరితంగా చెరువులో కలపడం అత్యంతదారుణమని, ఈ విషయంపై కలతచెందిన తన కుమారుడు ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని వీరభద్రయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనలేదని, ప్రభాకర్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని, ప్రభాకర్ భార్య సైతం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉందన్నారు. ప్రభాకర్ మరణానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రభాకర్ వీడియో ద్వారా దేశానికి చాటిచెప్పే ప్రయత్నం చేస్తే జరిగిన అన్యాయంపై కాకుండా తీసిన వీడియోపై రాద్ధాంతం చేయడం తమ కుటుంబ సభ్యులను మరింతగా బాధపెట్టేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభాకర్ కుటుంబానికి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని కోరాడు. ప్రభాకర్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, తమకు గల 7.10 ఎకరాల భూమిలో 3ఎకరాలను గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు చెరువులో కలిపిన తీరును వీరభద్రయ్య వివరించారు. ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వీరభద్రయ్య విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్ మరణానికి కారకులైన వారిపై తామిచ్చిన ఫిర్యాదు ఆధారంగా చర్య తీసుకోవాలని కోరారు. ప్రధాన నిందితులను తప్పించేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లు ప్రచారం ఉందని, ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన కిశోర్ వంటి నాయకులను తప్పిస్తే ప్రభాకర్ ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ ఫిర్యాదు ఆధారంగానే ఎఫ్ఐఆర్‌లో పేర్లు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. ప్రభాకర్ ఆత్మహత్య పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారని, ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా డిమాండ్ చేయడం శోకతప్తంతో ఉన్న తమ కుటంబానికి కొంత ఊరట కలిగించేదిగా ఉందన్నారు. అధికార పార్టీ నేతలు సైతం స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రెండురోజులు గడిచినా ప్రభుత్వపరంగా ఓదార్పు లభించలేదని, బుధవారం చింతకాని తహసీల్దార్ రమేశ్ మాత్రం పలు వివరాలను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. కాగా.. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రైతు సంఘం నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, జిల్లా నాయకులు లక్ష్మణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వీరప్రసాద్, కొండా గోపి ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ప్రభాకర్ మృతిపై సమగ్ర విచారణ

రైతు ప్రభాకర్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ కొనసాగుతున్నదని, ఈ ఘటన చాలా బాధ కలిగించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభాకర్ ఆత్మహత్య వెనుక గల కారణాలు.. ఎవరు ఉన్నారనే అంశాలపై లోతైన దర్యాప్తు జరుగుతున్నదని, కారకులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పోలీస్, రెవెన్యూ శాఖలు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో పరిశోధన చేస్తున్నాయని పేర్కొన్నారు.

## ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలి
- జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, కొండబాల

చింతకాని, జూలై 3 : రైతు ప్రభాకర్ కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొండబాల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరులో రైతు ప్రభాకర్ కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఘటనపై పూర్వాపరాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులు, రైతులు అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. అనంతరం రైతు భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40ఏళ్లుగా పట్టాదారు పాస్ పుస్తకం ఉండి వారసత్వంగా సాగు చేసుకుంటున్న రైతు ప్రభాకర్ పొలాన్ని మత్స్య సొసైటీకి చెందిన కొందరు వ్యక్తులు జేసీబీ, పొక్లెయిన్‌లతో ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. దీనిపై అధికారులను వేడుకున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దీంతో ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, నాయకులు బొడ్డు వెంకట్రామయ్య, పిన్నెల్లి శ్రీను, వేముల నర్సయ్య, పొనుగోటి రత్నాకర్ పాల్గొన్నారు.

## చింతకాని తహసీల్దార్ ఘెరావ్

చింతకాని తహసీల్దార్ రమేశ్‌ను రైతు ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఘెరావ్ చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రొద్దుటూరులో ఆత్మహత్యకు పాల్పడిన రైతు ప్రభాకర్ పొలాన్ని పరిశీలించడానికి తహసీల్దార్ తన సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల బృందంతో వెళ్లారు. విషయం తెలిసిన ప్రభాకర్ కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని తమకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. న్యాయం కోసం గతంలో వినతిపత్రం ఇవ్వగా ఎందుకు స్పందించలేదంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ప్రభాకర్ కుమారుడు వేదవ్యాస్, కుమార్తె శ్రీజ తహసీల్దార్ కాళ్లపై పడి ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, పొలం హద్దులను త్వరలో కల్పిస్తామని తెలిపారు. ఎస్సై షేక్ నాగుల్‌మీరా, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.